

అక్రమ కట్టడాలను తొలగించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గిరిజనులకు రక్షణ కవచంగా ఉన్న 1/70 భూ బదలాయింపు చట్టానికి విరుద్ధంగా మండలంలోని అరకు వారపు సంతలో చేపడుతున్న గిరిజనేతరుల అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అరకు పంచాయతీ కార్యాలయం సమీపంలో, అరకు గ్రామ చివర్లో అక్రమ కట్టడాలు జోరుగా సాగుతున్నా పంచాయతీ, రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోందన్నారు కొంతమంది గిరిజనేతరుల వద్ద ముడుపులు తీసుకుని భినామీ పేర్లతో అనుమతి ఇచ్చి అక్రమ కట్టడాలకు తోడ్పాటు అందిస్తున్నారని విమర్శించారు. పంచాయతీ కార్యాలయం ప్రక్కన విధ్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఉన్న స్థలం కబ్జా చేసినా పంచాయతీ అధికారులు మౌనంగా ఉండటం వెనుక రహస్యం ఏమిటని ప్రశ్నించారు. స్థానిక గిరిజనులకు ఇళ్ళ స్థలాలు లేక ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారని ఆయన చెప్పారు.

పెరుగుతున్న గోదావరి వరద ఉధృతి

-భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
-భయం గుప్పెట్లో ముంపు ప్రాంత ప్రజలు



విఆర్.పురం మండలంలో వాగులు పొంగడంతో మునిగిన పొలాలు, రహదారులు

ప్రజాశక్తి-ఎటపాక
గోదావరి మరో సారి ఉగ్రరూపం దాల్చుతోంది. బుధవారం మధ్యాహ్నానికి భద్రాచలం వద్ద 43 అడుగులకు వరద చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. సాయంత్రం 5 గంటల సమయానికి 44.1 అడుగులకు చేరింది. గోదావరి వరద పెరగడంతో మండలంలోని నెల్లిపాక, వీరాయి గూడెం మధ్య రహదారిపై వరద నీరు చేరడంతో ఆ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువ నుండి వరద వస్తున్న నేపథ్యంలో వరద ఇంకా పెరిగే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిడబ్ల్యూసి అధికారులు సూచించారు. మరోమారు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ముంపు ప్రాంతాల ప్రజలు కలవరపడుతున్నారు. జులైలో సంభవించిన తుఫాన్‌తో ఇప్పటికే పత్తి, వరి పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని, మరోమారు వరదలొస్తే ఉన్న కాస్త పంటలు పూర్తిగా దెబ్బతింటాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే మిర్చి పంటలు వేయాల్సి ఉండగా తుఫాను, వరదలతో ఆలస్యమవుతోంది.

చింతూరు : గోదావరి, శబరి, సీలేరు ఉపనదులు పొంగి ప్రవహించడంతో ఏజెన్సీ ప్రాంతంలో మళ్లీ అనేక గ్రామాలు జలదిగ్బంధంలో ఉండిపోయాయి. భద్రాచలం వద్ద 9.32.288 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుంది. పేరూరు కాలేశ్వరం బ్యారేజీల నుండి భారీగా నీరు విడుదల కావడంతో లోతట్టు ప్రాంతాల్లో అనేక గ్రామాలు ముంపుకు గురవుతున్నాయి. ఇప్పటికే మండలంలోని సోకిలేరు వద్ద అధికారులు నాటు పడాలని ఏర్పాటు చేసి ఎటువంటి ప్రాణహాని జరగకుండా అధికారులను సిద్ధం చేశారు. మంగళవారం రాత్రి నుండి కురిసిన భారీ వర్షానికి మళ్లీ వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. సోకిలేరు వాగు పొంగడంతో విఆర్ పురం చింతూరు మండలాల పరిధిలోని 50 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చింతూరులో బుధవారం సంతకు జనం రాక విలవిల పోయింది.



వరద నీటిలో దిగి గ్రామాలకు వెళ్తున్న చింతూరు ఐటిడిఏ పిఒ అపూర్వభరత్

విఆర్.పురం : మళ్లీ గోదావరి, శబరి వరద ఉధృతి పెరగడంతో వాటి వాహక ప్రాంతాలు ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మంగళవారం ఉదయం 6 గంటలకు 26.30 అడుగులు ఉన్న గోదావరి నీటి మట్టం బుధవారం సాయంత్రానికి 44.1 అడుగులకు చేరింది. మరో నాలుగు అడుగులు వస్తే తట్ట బుట్ట సదురుకొని మళ్లీ పునరావాస కేంద్రాలకు వెళ్ళవలసి వస్తుందని బాధితులు అంటున్నారు. ముందస్తుగా శ్రీరామగిరి వద్ద గుట్టలపై బాధితులు గుడారాలు వేసుకుంటున్నారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు ఉప్పొంగటంతో చింతరేగుపల్లి, సున్నం వారి గూడెం మధ్య, అడివివెంకన్నగూడెం, సృష్టివారిగూడెం మధ్య రాకపోకలు ఆగిపోయాయి. మండలంలో సుమారుగా 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలు కూడా పూర్తిగా నీట మునిగిపోయాయి. భద్రాచలం వద్ద ఇంకా నాలుగు అడుగులు వరద పెరిగితే శ్రీరామగిరి, వడ్డిగూడెం, గ్రామలు ప్రజలకు రాకపోకలు నిలిచిపోతాయని, ప్రభుత్వం తక్షణమే నాటు పడవలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పోచమ్మ గండి వద్ద నిలిచిన పాపికొండల పర్యాటక బోట్లు

దేవీపట్నం : గోదావరి ఉధతంగా ప్రవహిస్తుండడంతో దేవీపట్నం మండలం, గొందూరు గ్రామం వద్ద గండిపోచమ్మ అమ్మవారి ఆలయం పూర్తిగా మునిగిపోయింది. పోచమ్మ గండి నుంచి పాపికొండలకు వెళ్లే పర్యాటక బోట్లు ఆగిపోయాయి. మరో వైపు బుధవారం ఉదయం నుండి ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల వాగులు వంకలు పొంగుతున్నాయి. మండలంలోని ఇందుకూరుపేట, రావిలంక గ్రామాల మధ్య వినుకొండవాగు పొంగడంతో ఎం.రావిలంక, ముసలిగుంట, నాగంపల్లి కాలనీ, పోతవరం, గంగంపాలెం కాలనీ, దండంగి కాలనీ, దేవారం పోతుకొండ గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దేవీపట్నం మండల తహసీల్దార్, పోలీసులు పరిస్థితిని పర్యవేక్షించారు.

వరద గ్రామాల్లో సిపిఎం నాయకుల పర్యటన



శ్రీరామగిరిలో నీట మునిగిన రోడ్డుపై సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-విఆర్.పురం
గోదావరి వరద పెరుగుతున్న దృష్ట్యా మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో బుధవారం సీపీఎం నాయకులు పర్యటించారు. సీతంపేట-శ్రీరామగిరి మధ్య గోదావరి వరద రహదారులపై చేయడంతో మోకాళ్ల లోతు నీళ్ళల్లో రోడ్డు దాటి అవతలకు సీపీఎం నాయకులు చేరుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ వరద కారణంగా రాకపోకలు నిలిచిపోయిన గ్రామాలకు సహాయక చర్యలు చేపట్టాలని, నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీయం నాయకులు పులి ధర్మరాజు, గుండేపూడి లక్ష్మణరావు, కమ్మచిచ్చు సత్యనారయణ, నల్లారపు ప్రకాశరావు, కాంతారావు, సోడి మల్లయ్య, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకోవాలి

విఆర్.పురం : వరదల్లో ముంపు గురయ్యే గ్రామాల ప్రజలందరినీ సురక్షిత ప్రాంతాల్లో ఉంచి వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని శ్రీరామగిరి సర్పంచ్, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామం వద్ద గుట్టలపై బాధితులు వేసుకుంటున్న గుడారాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై నాటి వరదలకు ముంపునకు గురైన వారికి రూ.3వేలు మాత్రమే ఇచ్చారని, సుమారు పది రోజులపాటు గృహాలు నీట మునిగిపోవడంతో దెబ్బతిన్నాయని తెలిపారు. ఇల్లు కూలిపోయిన వారికి నేటికీ నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం వరద పెరుగుతున్న దృష్ట్యా ఎక్కడైతే రోడ్లు బ్లాక్ అవుతాయో అక్కడ పడవలు ఏర్పాటు చేసి నిత్యవసరాలు, కిరోసిన్ వరద బాధితులకు అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కె.కాంతారావు, నల్లారపు చందర్రావు ఉన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న చింతూరు ఐటిడిఏ పిఒ అపూర్వ భరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ముంపు ప్రాంతాల్లో ఐటిడిఏ పిఒ, సబ్ కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి-విఆర్ పురం
భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో లోతట్టు గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ సూచించారు. మండలంలోని చింతరేగుపల్లి, శ్రీరామగిరి, జీడిగుప్ప తదితర ముంపు గ్రామాలలో వారు పర్యటించారు. గుట్టలపై గుడారాలు వేసుకొని ఉంటున్న వారికి ముందుగానే కిరోసిన్, నిత్యావసర సరుకులు అందించాలని సిపిఎం నాయకులు పిఒకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ముంపు గ్రామాల ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాలలో తాగునీరు, ఆహారం, వైద్య సదుపాయాలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. గోదావరి- శబరి వరద సంబంధిత సమాచారం, సహాయం కోసం విఆర్.పురం తహశీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని,7331178088 నెంబర్‌కు 24/7 ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు సుబ్బారావు, ఎంపిడిఓ ఫణీంద్రరెడ్డి, ఎటపాక సీఐ కన్నమరాజు, సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, సోడి మల్లయ్య, పులి.ధర్మరాజు, ఆర్ఐ రామకృష్ణ కె.సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎఎస్‌పి పర్యటన

చింతూరు : చింతూరు ఎఎస్‌పి పంకజ్ కుమార్ మీనా వరద ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. చింతూరు వద్ద శబరి నదిని, రహదారిపై పొంగి ప్రవహిస్తున్న సోకిలేరు వాగును పరిశీలించారు. విఆర్.పురం మండలంలోని అన్నవరం వాగు, చింతరేవుపల్లి దగ్గరలోని కన్నాయిగూడెం, ఇప్పూరు వాగులను సందర్శించి వరద పరిస్థితిని పరిశీలించారు. వరద ప్రాంతాల్లో పోలీసులు తీసుకోవాల్సిన చర్యలపై సీఐ, ఎస్సైలకు సూచనలు చేశారు. వాగుల వరద నీటిలో ప్రజలెవ్వరు దాటకుండా భద్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరదల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ పర్యటనలో చింతూరు సీఐ దుర్గాప్రసాద్, ఎటపాక సీఐ కన్నమరాజు, చింతూరు ఎస్సై శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సోకులేరు వాగును పరిశీలిస్తున్న చింతూరు ఎఎస్‌పి పంకజ్ కుమార్ మీనా, పోలీసు అధికారులు



వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

కలుషిత ఆహార బాధిత కుటుంబాలకు
ప్రభుత్వ పరిహారం తక్షణమే చెల్లించాలి
-ఆదివాసీ గిరిజన సంఘం నిరసన

ప్రజాశక్తి -చింతపల్లి: అనకాపల్లి జిల్లా కోటవురట్ల కైలాసపట్నం మిషనరీ హాస్టల్లో కలుషిత ఆహారం తిని ఆసుపత్రి పాలైన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం తక్షణమే చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. బుధవారం చింతపల్లి తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి సాగిన చిరంజీవితో కలిసి బాధిత కుటుంబాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని అంజలి శనివారం, కిటుముల, అన్నవరం, పెద్దబరడ పంచాయితీల్లో నిమ్మలపాలెం, తాటిబంధ, చెక్కరాయి బంధపాలం, జంగంచెట్టు, మర్రిపాలెం, సిరిపురం గ్రామాల నుండి కోటవురట్ల కైలాసపట్నంలోని క్రిస్టియన్ మిషనరీ హాస్టల్లో చదువుతున్న బాధిత విద్యార్థులను పరామర్శించడానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు చికిత్స పొందుతున్న విద్యార్థులందరికీ 50 వేల పరిహారం ఇస్తామని హామీ ఇచ్చినా నేటికీ అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు కొంతమందికి మాత్రమే పరిహారాలు ఇచ్చి మిగతా వారికి ఇవ్వకుండా చేతులు దులుపుకోవడం భావ్యం కాదన్నారు. హామీ ఇచ్చిన పరిహారాన్ని అందజేయడంలో జిల్లా కలెక్టర్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. తక్షణమే బాధిత విద్యార్థుల కుటుంబాలకు పరిహారాలు అందించి ఆదుకోవాలన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బాధిత విద్యార్థుల తల్లితండ్రులు పాంగి రాంబాబు, సేందేరి రాంబాబు, పాంగీ అప్పారావు, తాంబేలి అప్పారావు, సేందేరి నాగరాజు,సేందేరి దేవి, తాంబేలి మార్త పాల్గొన్నారు.

పని తీరు మారకపోతే కఠిన చర్యలు : పిఒ

ప్రజాశక్తి-పాడేరు : గిరిజన సంక్షేమాధికారుల పనితీరు మారకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ హెచ్చరించారు. ఎటిడబ్ల్యాల పనితీరుపై అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసారు. బుధవారం తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో 11 మండలాల సహాయ గిరిజన సంక్షేమాధికారులు, ఉప సంచాలకులు కార్యాలయం సిబ్బంది తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్షేమాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆశ్రమ పాఠశాలల పర్యవేక్షణ గాడి తప్పుతోందన్నారు. జాంగుడ, బందవీధి సంఘటనలు ఎటిడబ్ల్యూ ఓల పనితీరుకు అద్దం పడుతోందన్నారు. మీ పిల్లలకు ఇలా జరిగితే ఊరుకుంటారాని ప్రశ్రించారు. ఆశ్రమ పాఠశాలలో ఉదయం మధ్యాహ్నం, సాయంత్రం వండుతున్న వంటల ఫోటోలను వాట్సాప్ లో షేర్ చేయాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన మెనూ అందించాలన్నారు. మెనూ అమలుపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, 11 మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

కిలగాడ కస్తూర్బా విద్యార్థినుల నిరసన

ప్రజాశక్తి-అల్లూరిడెస్క్:తమ సమస్యలను పరిష్కరించాలని ముంచింగిపుట్టు మండలం కిలగడ మెయిన్ రోడ్డులో కస్తూర్బా విద్యార్థినీలు నిరసన చేపట్టారు. కిలగాడ కేజీబీవీలో 6వ తరగతి నుండి 12వ తరగతి విద్యార్థినీలు సుమారు 274 మంది ఉన్నప్పటికీ, ఒకే బిల్డింగ్ లో తరగతి గదులు, వసతి గృహాలుగా ఏర్పాటు చేసి యాజమాన్యం కొనసాగిస్తుందని విద్యార్థినులు వాపోయారు.ఎస్ఓకు తెలియపరచినప్పటికీ ఆమె పట్టించుకోలేదని విద్యార్థినీలు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం చేయాలని పాఠశాల ప్రాంగణం నుండి కిలగాడ మెయిన్ రోడ్డు జంక్షన్ వరకు బుధవారం విద్యార్థినిలు నిరసన చేపట్టి ఆందోళనకు దిగారు. విద్యార్థినీలకు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ పాఠశాల ఎస్ ఓ తమర్భ జ్యోతి, ఎకౌంటెంట్ పుష్పావతిలు మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని విద్యార్థినీలు ఆవేదనతో తెలిపారు. ఉడికి ఉడకని అన్నం, రుచి పచీ లేని కూరలు, రంగు రుచి లేని పలుచటి రసం పెడుతున్నారని ఆరోపించారు.పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించి సంపూర్ణ విద్యా బోధన అందించాలని డిమాండ్ చేశారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు అదనంగా మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. రాత్రుల్లో పాఠశాల ప్రాంగణంలో తనిఖీల పేరిట పురుషుల ప్రవేశాలపై విద్యార్థినిలు ఆగ్రహించారు. ప్రవేశాలకు అనుమతి ఇచ్చిన ఎస్ఓ జ్యోతిను విధుల నుండి తొలగించాలని విద్యార్థినీలు డిమాండ్ చేశారు. ఆమె దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఓ, అకౌంటెంట్ పుష్పవతిలను విధుల నుండి తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మండల ఎంపీపీ అరిసెల సీతమ్మ, ఎంపీడీవో కే కిరణ్ కుమార్, స్థానిక ఎస్సై కే రవీంద్ర విద్యార్థినీల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందిస్తూ పాఠశాల ప్రాంగణానికి వారిని తీసుకువెళ్లారు.



ఆందోళన చేపడుతున్న విద్యార్థినులు

జిల్లాకు 17వేల దోమతెరలు సిద్ధం

-సరఫరాను ప్రారంభించిన కలెక్టర్ దినేష్ కుమార్



వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ల చొరవతో కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద వివిధ కంపెనీలు అల్లూరి సీతారామరాజు జిల్లాకు దోమతెరలు సరఫరా చేయడానికి ముందుకు వచ్చాయి. ఇందులో భాగంగా 11 కంపెనీలు రూ.37.40 లక్షల విలువ గల 17 వేల దోమతెరలు ఇవ్వడానికి సంసిద్ధత వ్యక్త పరిచినట్లు, అదేవిధంగా తోయోత్సు కంపెనీ మరో పది వేల దోమతెరలు అందించడానికి సంసిద్ధత వ్యక్తం చేసిందని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ తెలిపారు.

అనకాపల్లి జిల్లా యంత్రాంగం కృషితో ప్రస్తుతం పది వేల దోమతెరలు వివిధ కంపెనీల సహకారంతో దోమతెరలు అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కేంద్రమైన పాడేరుకు చేరుకున్నాయన్నారు. ప్రస్తుతం విఆర్ పురం మండలంలో గోదావరి వరదలు వచ్చే అవకాశం ఉన్నందున ఆ వరద ప్రభావిత ప్రాంతాలకు 2,500 దోమతెరలను యుద్ధ ప్రాతిపదికన పంపిణీ చేయాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి భరత్ ను కలెక్టర్ ఆదేశించారు. దోమతెరల వాహనాన్ని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ బుధవారం కలెక్టరేట్ లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ అభిషేక్, డి.ఆర్.ఓ బి.పద్మావతి, డి.ఎం.హెచ్.ఓ జమాల్ భాషా, డిఎ.ఓ తులసి, ఆయా కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ మృతులపై జెసి విచారణ

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు జిజీహెచ్ పరిధిలో డెంగీ తో ఇద్దరు మృతి చెందినట్లు తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు సంయుక్త కలెక్టర్ ఎం.జే. అభిషేక్ బుధవారం పాడేరు సర్వజన ఆసుపత్రిలో విచారణ జరిపారు. విచారణ నివేదికను కలెక్టర్ కు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ పర్యవేక్షకులు .విశ్వ మిత్ర, డిఎంహెచ్ఓ . జమాల్ భాషా తదితరులు పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న జెసి

సీతాఫలాల ధర పతనం

ప్రజాశక్తి -అనంతగిరి:సీతాఫలాలకు కనీసం గిట్టుబాటు పలకక పోవడంతో మండలంలోని రైతులు లబోదిబోమన్నారు. కావడి ధర రూ, 2500 పైగా, కాగా ఒక్క కేటు ధర వెయ్యి రూపాయలకే పలకడంతో రైతులు లబోదిమన్నారు. రైతులకు సంవత్సరానికి ఆదానిచ్చే చింత, పనసపండు, జామ, కమల పల సాయంలో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో లభించే సీతాఫలం పళ్లకు కనీస ధర లభించ లేదు. మండలంలోని బుధవారం జరిగిన వరపు సంతంలో కాశీపట్నం, డమ్ముకు సంతలలో గిరిజన రైతులు పళ్ళను విక్రయించారు. వ్యాపారస్తులు కనీస ధరకు కొనుగోలు చేపక పోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టానికి గురయ్యారు. డముకు వరపు సంతలో పెద్దబిడ్డ, గుమ్మ, లుంగపర్తి, వాలసి, వేగడ, పైనంపాడు, పంచాయతీలకు చెందిన గిరిజన రైతులు విక్రయిస్తారు, కాశీపట్నం వారపు సంతలో పలు పంచాయతీల గిరిజనులు విక్రయిస్తారు.



వెల వెల బోయిన సంత

విద్యార్థులకు ప్రత్యేక వైద్య సేవలు

ప్రజాశక్తి-పాడేరు:గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో స్కాబిస్ సోకిన విద్యార్థులకు ప్రత్యేకంగా వైద్యసేవలు అందిస్తున్నామని ఐటిడిఏ పిఓ వి. అభిషేక్ స్పష్టం చేసారు. బుధవారం స్థానిక తలారిసింగి గిరిజన సంక్షేమ ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు చర్మ వ్యాదుల వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు నిర్వహించారు. 528 మంది విద్యార్థులకు చర్మవ్యాదుల పరీక్షలు నిర్వహించి 108 మందికి స్కాబిస్ ఉన్నట్లుగా వైద్య నిపుణులు గుర్తించారు. అనంతరం ఐటిడిఏ పిఓ చేతుల మీదగా విద్యార్థులకు మాత్రలు మింగించి సబ్బులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ, పెరిమిత్రిన్ సబ్బులు, ఐవర్మెక్టిన్ మాత్రలు వినియోగంతో 96 శాతం మందికి స్కాబిస్ తగ్గిందని చెప్పారు. మందులు మంచి ఫలితాలు ఇచ్చాయని తెలిపారు. దీన్ని ప్రాతిపదికగా తీసుకుని ఏజెన్సీలోని 117 ఆశ్రమ పాఠశాలల్లో ద్యార్థులకు స్కాబిస్ పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ భాషా, జనరల్ ఆసుపత్రి సూపరిండెంట్ . విశ్వమిత్ర, చర్మ వ్యాదుల నిపుణులు లక్ష్మి సరోజిని, అనిరత్నం, ఎర్రయ్య, 11 మండలాల ఎటిడబ్ల్యూ ఓలు తదితరులు పాల్గొన్నారు.



మాత్రలు ఇస్తున్న పిఒ

మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత కార్యాలయం చిల్డ్రన్ హోంలో కాంట్రాక్ట్, ఔట్సోర్స్ పద్ధతిన పని చేయుటకు మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెలెక్షన్ కమిటీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 25 - 42 సంవత్సరాల మధ్య వయసు గల ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు ఈనెల 13వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులు నేరుగా స్త్రీ శిశు సంక్షేమ కార్యాలయం, రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా గాని సమర్పించ వచ్చని తెలిపారు. పోస్టుల వివరాలు: ఆఫీస్ ఇంచార్జ్ -1, కుక్ -3, హెల్పర్-కం-నైట్ వాచ్ ఉమెన్ -2, పిటి ఇంస్ట్రక్టర్-కం-యోగ టీచర్ -1, ఎడ్యుకేటర్ -3, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్-కం-మ్యూజిక్ టీచర్ -3 కలిపి మొత్తం 13 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

మెనూ అమలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా లో ఉన్న కస్తూర్బా విద్యాలయాల్లో మెనూ సక్రమంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్ శ్రీను, జీవన్ కృష్ణ, ఉపాధ్యక్షులు చిన్నారావులు డిఇఒకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గిరిజన విద్యార్థుల వసతి గృహాల్లో మెనూ అమలులో జరుగుతున్న అనేక అవకతవకలు ఇటీవల వెలుగు చూస్తున్నాయని దీనిపై అధికారులు దృష్టి సారించి తగు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ముంచంగిపుట్ మండలం కిలగాడ కేజీబీవీ స్కూలు, కాలేజీ విద్యార్థినిలు మెనూ సక్రమంగా అమలు చేయలేదని రోడ్డెక్కిన పరిస్థితి ఇందుకు నిదర్శనమని వారు పేర్కొన్నారు.. మెనూ ప్రకారం భోజనం సక్రమంగా పెట్టమని ఎస్‌ఓ ను అడుగుతుంటే కొట్టడం, తిట్టడం చేస్తున్నారన్నారు. కేజీబీవీలో టీచర్స్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు.


వినతి పత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

ఎపిఎం అప్పయ్యమ్మ బాధ్యతల స్వీకరణ


ఎపిఎం అప్పయ్యమ్మ

ప్రజాశక్తి-హుకుంపేట: ఏపిఎంగా చెట్టి అప్పయ్యమ్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో హుకుంపేట ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న చిన్నారావు పాడేరుకు బదిలీ అయ్యారు. అరకులో విధులు నిర్వహిస్తున్న అప్పయమ్మ ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు.అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గ్రామస్థాయిలో డ్వాక్రా సంఘాలను బలోపేతం చేస్తామన్నారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్య ంగా వ్యవహరించకుండా సమయపాలన పాటించాలని కోరారు.

ఫార్మసిస్ట్, శానిటరీ వర్కర్‌కు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-పాడేరు : హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న శానిటరీ వర్కర్‌కు, ఫార్మసిష్టుకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ డి ఎం హెచ్ ఓ . జమాల్ భాషను ఆదేశించారు. హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హాజరు పట్టి, స్టాక్ రిజిస్టర్, ఇతర రిజిస్టర్ లను పరిశీలించారు. అదేవిధంగా రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో భాగంగా పారిశుధ్య నిర్వహణ, మందుల పంపిణీ కేంద్రాలను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం పట్ల శానిటరీ వర్కర్ పై మండిపడ్డారు. అదేవిధంగా మందులు అస్తవ్యస్తంగా పడేయడం పట్ల అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్ వారిద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. ముందుగా గడుగుపల్లికి చేరుకున్న కలెక్టర్ స్థానికంగా ఇసుకను అనుమతి లేకుండా తవ్వడాన్ని గమనించారు. అనంతరం గిరిజన సంక్షేమబాలుర పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో అమలు చేస్తున్న మెనూ, విద్యా బోధనపై విద్యార్థులతో ఆరా తీశారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. ఈ పర్యటనలో హుకుంపేట తహసిల్దార్, ఎంపీడీవో పాల్గొన్నారు.

అందుబాటులో ఆధార్ సేవలు

ప్రజాశక్తి- హుకుంపేట: ఆధార్ సేవలను మూడు రోజులపాటు తాడేపుట్టు గ్రామ పంచాయితీ పరిధిలో నిర్వహించడం జరుగుతుందని సర్పంచ్ సోమేలి సత్యవతి బుధవారం పేర్కొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, పుట్టిన పిల్లలు, ప్రీ స్కూల్ చదువుచున్న పిల్లల నమోదు, మార్పులు, చేర్పులు, ఫోన్ నెంబర్ లింకు తదితర సేవలను వినియోగించుకోవాలన్నారు. 3 రోజులలో పాటు సేవలు అందించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సోమేలి లక్ష్మయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆధార్ సేవలు అందిస్తున్న సిబ్బంది

పాఠశాల భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు: మండలంలోని వంజంగి హిల్స్ పర్యాటక నిధులు రూ .7.60 లక్షల వ్యయంతో ఆధునికరించిన మూడు ప్రాథమిక పాఠశాల భవనాలను ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ బుధవారం ప్రారంభించారు. వంజంగి పంచాయితీ కొత్తవలస గ్రామంలో రు.2.80 లక్షల వ్యయంతో ఆధునికరించిన గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల భవనం, ఎస్ కొత్తూరులో రు.2.40 లక్షలు, కాడెలి పంచాయితీ వర్తనపల్లి రు.2.40 లక్షల వ్యయంతో ఆధునికరించిన పాఠశాల భవనాలను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వంజంగి హిల్స్ పర్యాటక నిధులతో పాఠశాల భవనాలను ఆధునికరించామని చెప్పారు. గత ఏడాది పర్యాటక సీజన్లో వంజంగి హిల్స్ కు రు. 25 లక్షల ఆదాయం వచ్చిందని చెప్పారు. పర్యాటపరంగా వచ్చిన నిధులతో గ్రామాల్లోని రహదారులు, పాఠశాల భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. దసరా నుండి వంజంగి హిల్స్ను సందర్శించే పర్యాటకులు పెరుగుతారని చెప్పారు. ఈ సంవత్సరం వంజంగి హిల్స్ కు రు. 35 లక్షలు ఆదాయం వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. వంజంగి హిల్స్ పై పారా మోటరింగ్ ఫ్లయింగ్ ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎంపీడీవో కె.సాయి నవీన్, తహసిల్దార్ వి. త్రినాథరావు, ఎంఈఓ సరస్వతి, వంజంగి సర్పంచ్ వంతాల బొంజుబాబు, లగిసపల్లి సర్పంచ్ లకే పార్వతమ్మ, ఎంపిటిసి రామకృష్ణ పాత్రుడు, వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.


పాఠశాల భవనాలను ప్రారంభిస్తున్న పిఒ అభిషేక్

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న కార్యకర్తలు

ప్రజాశక్తి-అరకులోయ:స్థానికంగా దొరికే ఆకు కూరలు, ఇతర కూరగాయలు, పిండి పదార్థాలు వంటి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యం మెరుగు పడుతుందని కొత్త బళ్ళుగూడ ఎంపిటిసి స్వాభి లక్ష్మి అన్నారు. సుంకరమెట్ట సెక్టార్ పరిధిలోని కొత్త బల్లు గూడ, సుంకరమెట్ట పంచాయతీ లోని 20 అంగన్వాడి సెంటర్లకు సంబంధించిన అంగన్వాడి కార్యకర్తలు, బాలింతలు, గర్భిణీలు లతో కలిసి గద్యగుడ అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి లక్ష్మి మాట్లాడుతూ, స్థానికంగా దొరికే కూరగాయలతో మెరుగైన ఆరోగ్యం కలుగుతుందన్నారు. గిరిజన సాంప్రదాయ వంటకాలు తీసుకోవడంతో మంచి ఆరోగ్యం కలుగుతుందన్నారు. గద్యగూడ అంగన్వాడి కార్యకర్త పొద్దు లలిత కుమారి ఆధ్వర్యంలో జరిగిన పౌష్టికాహార మాసోత్సవాల్లో అంగన్వాడీలు, కార్యకర్తలు జ్యోతి, వెంకటలక్ష్మిలు అవగాహన కల్పించారు. సుంకరమెట్ట సెక్టర్ లోని 20 అంగన్వాడీ కేంద్రాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన విద్యుత్ లైన్ మంజూరు

సిపిఎంకు గిరిజనుల అభినందనలు

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని భీమవరం పంచాయితీ గంగరాజు పుట్టు, కొంకోడి బంధ గ్రామాలకు కొత్త విద్యుత్ లైన్ మంజూరైందని బుదవారం హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యుత్ సౌకర్యం కోసం ఎన్నో మార్లు ఇబ్బందులు పడ్డారన్నారు. గతంలో విద్యుత్ లైన్ లేక ఇబ్బందులకు గురవుతూ ఎన్నో రోజులు చీకటి రాత్రుల్లో ఈ రెండు గ్రామాల గిరిజనులు గడపారన్నారు. స్పందించిన అధికారులు బుధవారం గ్రామంలో విద్యుత్ వైర్లను వేశారన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై అధికారుల దృష్టికి తెలియజేసి పరిష్కారానికి చొరవ చూపిన సిపిఎం నాయకులకు గ్రామ ప్రజలు అభినందనలు తెలిపి ఆనందం వ్యక్తం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మాజీ సర్పంచ్ వలస నైని లక్ష్మణరావు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కొండలరావు

20 వేల మందికి కంటి పరీక్షలు చేస్తాం

ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్

ప్రజాశక్తి -హుకుంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 20వేల మంది గిరిజనులకు కంటి పరీక్షలు చేయడమే లక్ష్యమని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ స్పష్టం చేశారు. హుకుంపేట మండలం తీగవలస పంచాయతీ ఓలుబెడ్డ గ్రామంలో నిర్వహించిన కళ్లద్దాలు పంపణీ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అనంతరం అందర్నీ స్వగ్రామాలకు తరలించే బాధ్యత ఐటిడిఎ తీసుకుంటుందన్నారు. హుకుంపేట మండలం ఒలుబెడ్డ గ్రామాల్లో 502 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 126 మందికి ఉచితంగా కళ్ళ అద్దాలు పంపిణీ చేశామని చెప్పారు. 55 మందికి కాట్రాక్ట్ ఆపరేషన్స్ చేస్తామన్నారు. గుమ్మడిగండువ గ్రామంలో 284 మందికి కంటి పరీక్షలు చేశామన్నారు. 72 మందికి కళ్ళ అద్దాలు పంపిణి, 18 కంటి ఆపరేషన్లు చేస్తామన్నారు. ఈ విధంగా పలు గ్రామాల గిరిజనులు కంటి వైద్య సేవలు అందిస్తామన్నారు. పాడేరు జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర మాట్లాడుతూ కంటి ఆపరేషన్ చేసుకున్న వారికి ఆరోగ్యశ్రీ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రు.1500లు ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఉచిత కంటి ఆపరేషన్ చేసుకోవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ గిరిజన సంక్షేమ అధికారిని ఎల్.రజిని, ఈవో.పిఆర్‌డి అప్పలరాజు, తీగలవలస సర్పంచ్ పాంగి బేషు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలులో కుండపోత వర్షం

ప్రజాశక్తి-పెదబయలు: మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. భయంకరమైన ఉరుములు, మెరుపులతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వర్షానికి ముందు ఎండ కాయడంతో వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నం అయ్యారు. ఒకేసారి చీకటి వాతావరణం ఏర్పడటంతో వాతావరణంలో మార్పు చోటుచేసుకొంది. ఒకే సారిగా వర్షం ఏకధాటిగా కురిసింది.

కాలం చెల్లిన బస్సులతో ఇక్కట్లు

ప్రజాశక్తి- అనంతగిరి:అనంతగిరి, అరకు ఘాట్ రోడ్డులో నడిచే పల్లె వెలుగు, ఇతర డీలక్స్ బస్సులు కాలం చెల్లినవి కావడంతో తరచూ ఎక్కడపడితే అక్కడ నిలిచిపోతున్నాయి. అనంతగిరి, అరకు ఘాట్ రోడ్డు లో విశాఖ- ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్ పరిధి నుండి ఆర్టీసీ యాజమాన్యం బస్సులను నడుపుతుంది. బుధవారం శివలింగపురంలో పల్లె వెలుగు బస్సు నిలిచి పోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. కండిషన్ బస్సులను ఘాట్ రోడ్డు లో నడపాలని పలువురు ప్రయాణకులు కోరుతున్నారు.


నిలిచిపోయిన పల్లె వెలుగు బస్సు

శ్రీరామ్ ఫైనాన్స్ నూతన గోల్డ్ లోన్ పథకం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ రాబోయే పండుగ సీజన్‌కు ముందు కస్టమర్లకు సులభంగా నిధులను అందజేసే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్‌లో 'జిత్నే సమయ్ కా లోన్ ఉత్నే కా హి బయాజ్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ సందర్భంగా ఎంవిపి డబల్ రోడ్డులోని శ్రీ రామ్ ఫైనాన్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎలిజబెత్ వెంకటరామన్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా తమ శాఖలను గోల్డ్ లోన్ శాఖలుగా మార్చడానికి పెట్టుబడి పెడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం, ఆంధ్రప్రదేశ్‌లోని 304 శాఖల్లో 184 శాఖలు గోల్డ్ లోన్‌లను అందిస్తున్నాయని, క్యూ1 ఎఫ్ వై25 నాటికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మొత్తం ఎయుఎం రూ.22,198.21 కోట్లు అందులో రూ.1,273.26 కోట్లు గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియో నుంచేనని వివరించారు. అవసరాన్ని బట్టి బంగారాన్ని తాకట్టు పెట్టడం, రీడీమ్ చేయడం జరుగుతున్నాయని తెలిపారు.

11న ఎంజి విండ్సర్ విడుదల

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జెఎస్ డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా నుంచి ఇంటిలిజెంట్ క్రాస్ ఓవర్ యుటిలిటి వెహికిల్ ఎంజి విండ్సర్ వాహనాన్ని ఈ నెల 11న దేశవ్యాప్తంగా ఆవిష్కరించనున్నట్లు సంస్థ ప్రతినిధి జాన్సన్ తెలిపారు. బీచ్ రోడ్డులోని ఎంజి షోరూంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అత్యంత ఆధునికమైన డిజైన్‌తో ఈ వాహనాన్ని రూపొందించినట్లు చెప్పారు. పొడవైన వీల్ బేస్‌తో, కావలసినంత కేబిన్ స్థలాన్ని, విశాలమైన ఇంటీరియర్స్‌తోపాటు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఫీచర్లు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు.

విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునర్ధురణ పనుల్లో ఎపిఇపిడిసిఎల్

క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్న సిఎండి పృధ్వీతేజ్


పునరుద్ధరణ పనుల్లో ఇపిడిసిఎల్ సిబ్బంది, క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్న సిఎండి పృధ్వీతేజ్

ప్రజాశక్తి- సీతమ్మధార : వరదల కారణంగా విజయవాడలో దెబ్బతిన్న విద్యుత్తు వ్యవస్థ పునరుద్ధరణకు విద్యుత్ సంస్థలు సమష్టి కృషితో పని చేస్తున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశాలకనుగుణంగా అస్తవ్యస్తమైన విద్యుత్ వ్యవస్థను త్వరితగతిన సరిదిద్దేందుకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది రేయింబవళ్ళు శ్రమిస్తున్నారు. కాలనీల్లో చేరిన వరదనీటిని సైతం లెక్కచేయకుండా యుద్ధ ప్రాతిపదికన విద్యుత్తును పునరుద్ధరించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృధ్వీతేజ్ ఆధ్వర్యంలో అధికారులతో పాటు 906 మంది సిబ్బంది 90 బృందాలుగా విజయవాడ చేరుకుని, అక్కడ సహాయక, విద్యుత్ పునరుద్ధరణ చర్యల్లో భాగస్వాములయ్యారు.

సిఎండి పృధ్వీతేజ్ ఇమ్మడి క్షేత్రస్థాయిలో నిరంతరంగా పర్యటిస్తూ, ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తూ.. సిబ్బందికి అవసరమైన సూచనలిస్తూ విద్యుత్ పునరుద్ధరణ పనులనుపూర్తి చేస్తున్నారు. బుధవారం ఉదయం కొల్లిపర సెక్షన్‌లో అధికారులతో సమీక్షించిన సీఎండీ పృధ్వీతేజ్ అనంతరం గాజులలంక 11కెవి ఫీడర్ పరిధిలోని పెసరలంక, ఆవులవారిపాలెం, 33 కెవి భట్టిప్రోలు ఫీడర్, మోపిదేవి సెక్షన్ పరిధిలోని బొబ్బరలంక గ్రామం, 11కెవి అజిత్‌సింగ్ నగర్ ఫీడర్, 11కెవి తమ్మిన దుర్గా నగర్ ఫీడర్, సింగ్‌నగర్ సెక్షన్, 11కెవి లోనా ఫీడర్, ఏఎస్ఆర్ నగర్ భారతమాత ఫీడర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో పాల్గొన్నారు. స్వల్పకాలంలో అన్నివిద్యుత్ సంస్థలన్నీ సమిష్టిగా విద్యుత్ పునరుద్ధరణకు చేస్తున్న కృషిని ప్రజలు, వినియోగదారులు హర్షిస్తూ, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశంసిస్తున్నారు.

రాజారెడ్డి ఉద్యోగ విరమణ వీడ్కోలు


రాజారెడ్డి దంపతులను సత్కరిస్తున్న జిసిసి కార్యాలయ సిబ్బంది

ప్రజాశక్తి -మారేడుమిల్లి : జిసిసి మేనేజర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన ముర్ల నరసింహారాజారెడ్డిని బుధవారం జిసిసి సిబ్బంది ఘనంగా సత్కరించారు. మండల కేంద్రంలోని జిసిసి కార్యాలయం వద్ద బుధవారం జరిగిన వీడ్కోలు సభలో సిబ్బంది, కుటుంబ సభ్యులు రాజారెడ్డికి దుస్సాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిసిసి డిఎం మాట్లాడుతూ జిసిసి మేనేజర్‌గా ఎంతో మందికి ఆయన సేవలు గుర్తిండిపోయేలా చేశారని తెలిపారు. రాజారెడ్డిని ఆదర్శంగా తీసుకొని పని చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజారెడ్డి కుటుంబ సభ్యులు, జిసిసి సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

అన్ని గ్రామాలకు మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి :మండలంలోని అన్ని గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు ఎంపిడిఒ ఎ.వీరకిశోర్ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సార్ల లలితా కుమారి అధ్యక్షతన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వీర కిషోర్ మాట్లాడుతూ గిరిజనులకు వ్యక్తిగత హక్కులు, పలు ప్రభుత్వ పథకాలు కల్పించడం జరుగుతుందని చెప్పారు. గిరిజన గ్రామాలకు రహదారులు, డిజిటల్ కనెక్టివిటీ లేకపోవడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని, ప్రతి పివిటిజి కుటుంబాన్ని కవర్ చేస్తూ వారి ఇంటి వద్ద సౌకర్యాలను అందించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో తాగునీరు సమస్య లేకుండా చేతి పంపులు, నీటి ట్యాంక్‌లు ఏర్పాటు చేయడం, క్లోరినేషన్ చేయడం జరుగుతుందని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నారాయణ చెప్పారు. మలేరియా, టైఫాయిడ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్న వేళ ఆరోగ్య కేంద్రాలలో అన్నివేళల్లో వైద్యం అందిస్తున్నామని వైద్యాధికారులు హరికృష్ణ, సుబ్రమణ్యం తెలిపారు. పిఎం జన్‌మన్ పథకం కింద మండలానికి 680 గృహాలు మంజూరైనట్లు గృహనిర్మాణ ఏఈ జి.శ్రీనివాస్ తెలిపారు. నీటి ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేసుకోవాలని, వర్షా కాలంలో వచ్చే అంటువ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలని పిఆర్ అండ్ ఆర్‌డి ఇఇ పి.విజయ్ కుమార్ తెలిపారు. కాకూరు, ఎలివాడ గ్రామాల రహదారి పూర్తిగా పాడైపోయిందని, దానికి మరమ్మతులు చేయాలని మండల కో-ఆప్షన్ సభ్యులు గురుకు ధర్మరాజు కోరారు. సమావేశంలో తహశీల్దార్ కె.సుబ్బారావు, పరిపాలనాధికారి జయంతి, ఏబిపి మనస్విని, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.


మండల సభలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వీరకిశోర్

జిసిసి ఇన్‌ఛార్జి మేనేజర్‌గా విజయలక్ష్మి


విజయలక్ష్మిని అభినందిస్తున్న జిసిసి సిబ్బంది

ప్రజాశక్తి -అడ్డతీగల :అడ్డతీగల గిరిజన సహకార సంస్థ మేనేజర్‌గా విజయలక్ష్మి బుధవారం బాధ్యత స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన చంద్రశేఖర్ ఉద్యోగ విరమణ చేశారు. రాజవొమ్మంగి మేనేజర్‌గా పని చేస్తున్న విజయలక్ష్మికి ఉన్నతాధికారులు అడ్డతీగల మేనేజర్‌గా ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

బాధ్యతలు స్వీకరించిన విజయలక్ష్మిని జిసిసి సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మాజీ మేనేజర్ చంద్రశేఖర్, అకౌంటెంట్ బుచ్చిరాజు, వెంకటేష్, బాజీ, బుల్లబ్బాయి రెడ్డి, అర్జున్, రవి, రాంబాబు, సత్యవతి, శైలజ, శాంతి, టిడిపి నాయకులు గొర్రె నిశాంత్, జనసేన నాయకులు గోపి సీతామహాలక్ష్మి, సింగోజి శ్రీను బాబు, వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌మా విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం గాలికొండ, ఎ.దారకొండ పంచాయతీల పరిధిలోని 500 మంది గిరి రైతులకు ఐదు టన్నులు రాజ్మా విత్తనాలను సప్పర్ల గ్రామంలో బుధవారం సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ బలరాం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు కేవలం 10 కేజీలు మాత్రమే పంపిణీ చేయడంతో రైతులు నిరాశ గురయ్యారు. చాలీచాలని విత్తనాలతో ఏ విధంగా వ్యవసాయాలు చేస్తామని వారు ప్రశ్నించారు. అధికారులు స్పందించి ఒక్కో రైతుకు సుమారు 50 కేజీలకు పైగా విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గాలికొండ ఎంపీటీసీ బుజ్జిబాబు, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్, టిడిపి కుటమి నాయకులు జి.చంద్రరావు, పాండు, పాంగి రాంబాబు, కించే భీమన్న, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న బలరాం

కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి -భీమునిపట్నం : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టామనిఇన్‌ఛార్జి ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశంలో మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయనున్నట్లు తెలిపారు. మృతి చెందిన, శాశ్వత వలస పోయిన వారి ఓట్లను తొలగిస్తామన్నారు. ఇంటింటికి వెళ్లి ఓటర్ల నమోదు చేపట్టి, వచ్చేనెల 25న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రదర్శిస్తామని స్పష్టం చేశారు. 1500మందికి మించి ఓటర్లుంటే పోలింగ్ కేంద్రాలను విభజిస్తామన్నారు. అలాగే 1500లోపు ఓటర్లున్న పోలింగ్ కేంద్రాలను విలీనం చేస్తామన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియకు అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో తహశీల్దార్ పి రామారావు, ఎలక్షన్ డిటి , టిడిపి నుంచి గంటా నూకరాజు, వైసిపి నుంచి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చిన్నారుల మృతిపై సమగ్ర విచారణ

ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సురేష్

ప్రజాశక్తి-చింతూరు :చింతూరు మండలంలో కొన్ని రోజుల వ్యవధిలో 8 మంది చిన్నారులు మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ డిమాండ్ చేశారు. చింతూరులో బుధవారం జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో సురేష్ మాట్లాడుతూ వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం బాధాకరమన్నారు. నాటు వైద్యాన్ని, మంత్రగాళ్లను ఆశ్రయించడమే చిన్నారులు మృతికి కారణమని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెప్పడం సరైనది కాదన్నారు. రాష్ట్ర విభజన అనంతరం చింతూరు ఆసుపత్రిని ఏరియా ఆసుపత్రికి అప్‌గ్రేడ్ చేసినా, ఆ స్థాయిలో నేటికీ సౌకర్యాలు లేవని తెలిపారు. రోగులకు అవసరమైన గదులు లేవని, వ్యాధి నిర్ధారణ పరీక్షలు పూరిస్థాయిలో జరగడం లేదని చెప్పారు. ఇక్కడ సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో రోగులను ఇతర ప్రాంతాలకు మెరుగైన వైద్యం పేరుతో పంపిస్తున్నారని, ఆర్థిక భారంతో రోగులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే 100 పడకలతో ఏరియా హాస్పిటల్‌గా అభివృద్ధి చేసి, స్పెషలిస్ట్ వైద్యులను నియమించాలని కోరారు. స్థానిక ఆసుపత్రిలో ఫార్మసిస్ట్ ఒక్కరు మాత్రమే ఉండడంతో మధ్యాహ్నం తరువాత మందులకు ఇబ్బంది వస్తుందని, అదనపు ఫార్మాసిస్టులను నియమించాలని కోరారు. ఆశ్రమ పాఠశాలలో ఆరోగ్య కార్యకర్తలను ఏర్పాటు చేస్తామని టిడిపి కూటమి చెప్పిందని, కాని నేటికీ అమలు చేయలేదని పేర్కొన్నారు. తక్షణమే ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎంలను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మట్టం రాజయ్య, కారం సుబ్బారావు, పోడియం లక్ష్మణ్, కుంజ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో అపెండిక్స్ శస్త్ర చికిత్స

ప్రజాశక్తి-చింతూరు :చింతూరు ఏరియా ఆసుపత్రిలో బుధవారం ఒక వ్యక్తికి అపెండిక్స్ (24 గంటల కడుపు నొప్పి) శస్త్ర చికిత్స నిర్వహించారు. చింతూరు మండలం రామన్న పాలెం గ్రామానికి చెందిన పి.రవికి అపెండిక్స్ రావడంతో కుటుంబ సభ్యులు తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. అక్కడి వైద్యులు వెంటనే ఆపరేషన్ చేయాలని సూచించారు. చేతిలో డబ్బులు లేకపోవడంతో చేసేదిలేక చింతూరు ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. చింతూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, ఎనస్థీషియా డాక్టర్ ఎంవీ కోటిరెడ్డి నేతృత్వంలో బుధవారం కూనవరం ఆసుపత్రి సూపరింటెండెంట్, జనరల్ సర్జన్ డాక్టర్ మహేష్ బాబు రవికి ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. చింతూరు ఏరియా ఆసుపత్రిలో అపెండిక్స్ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించినట్లు సూపరింటెండెంట్ ఎంవీ కోటిరెడ్డి తెలిపారు. గతంలో ఇదే ఆసుపత్రిలో సిజేరియన్లు, ఆర్థోపెడిక్, హిస్టక్టమీ కేసులకు ఆపరేషన్లు చేశామని, అపెండిక్స్ కేసు ఇది రెండవదని పేర్కొన్నారు. పేషెంట్ రవి ఆరోగ్యం మంచిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ నర్స్ కుమారి, ఆపరేషన్ థియేటర్ స్టాఫ్ కుమారి, వినయ్, కనక పాల్గొన్నారు.


ఆపరేషన్ చేయించుకున్న రవి

వరదల కారణంగా నేటి నిరసనలు వాయిదా

ప్రజాశక్తి -సీలేరు : యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఈ నెల 5న తలపెట్టిన నిరసన కార్యక్రమాలు వరదలు కారణంగా వాయిదా వేసినట్లు సిఐటియు సీలేరు బ్రాంచ్ అధ్యక్షుడు బి.లక్ష్మణ్, కార్యదర్శి విష్ణుకుమార్ తెలిపారు. బుధవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ విద్యుత్ ఒప్పంద కార్మికుల సమస్యలపై ఏపీ జెన్కో, ట్రాన్స్‌కో డిస్కమ్ తదితర కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలకు యూనియన్ పిలుపు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే విజయవాడలో వరదలు కారణంగా ఈ నిరసన కార్యక్రమాలను వాయిదా వేసినట్లు చెప్పారు. మళ్లీ ఈ కార్యక్రమాన్ని ఎప్పుడు నిర్వహించాలో రాష్ట్ర నాయకత్వం నిర్ణయిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు గౌరవ అధ్యక్షులు ఎస్కే.సుభాన్, ఏపీ జెన్కో కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.